

# దాంపత్యం

వీరభద్రరావ్ పమ్మి

శంకరం నిద్రలేచి బ్రష్ చేసుకుని పేపర్ పట్టుకుని హాల్లో సోఫాలో కూర్చున్నాడు. పని పిల్ల కాఫీ తెచ్చి ఇచ్చింది.

ఓ గంటపోయాక శంకరం స్నానం ముగించి బట్టలేసుకుని హాల్లోకి వచ్చాడు. టేబుల్‌మీద అన్నీ సిద్ధంగా ఉన్నాయి. అతనే కావల్సినవి వడ్డించుకుని భోజనం ముగించాడు. బూట్లు వేసుకుని ఇంట్లోంచి బైటికి వెళ్ళి కాలింగ్‌బెల్ కొట్టాడు.

అతని వెనకాలే ఇంటి తలుపులు మూసుకున్నాయి. బోల్టు వేసిన చప్పుడు కూడా అయింది. అతను స్కూటర్ స్టార్ట్ చేసి బ్యాంక్‌కి వెళ్ళిపోయాడు.

శంకరం సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. అతను బట్టలు మార్చుకుని స్నానం చేసి, హాల్లోకి వచ్చి టి.వి ముందు కూర్చున్నాడు. తొమ్మిదింటికి గిన్నెల చప్పుడైతే డైనింగ్ టేబుల్ దగ్గరకెళ్ళాడు. పొద్దుటిలాగే గిన్నెలన్నీ సిద్ధంగా ఉన్నాయి. వడ్డించుకుని భోజనం పూర్తి చేశాడు. మరి కాసేపు టి.వి చూసి పడక గది కాకుండా మరో గదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

వారం రోజులుగా అతని దినచర్య అలాగే కొనసాగుతోంది. అతని భార్య గౌరీదేవి ఇంట్లోనే ఉంది. వేళకి భోజనం, కాఫీ అన్నీ ఆవిడే అమరుస్తుంది.

కాని అతనికెదురు పడకుండా తప్పించుకు తిరుగుతోంది. ఆవిడకి భర్త మీద చాలా కోపంగా ఉంది. అతనూ ఆమె కెదురుపడి పలకరించడానికి ప్రయత్నించడం లేదు. అతనిని.అపరాధ భావం అడ్డుకుంటోంది.

వాళ్ళకి పెళ్ళయిన పాతికేళ్ళలో చిన్న చిన్న గొడవలు రాకపోలేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేసిన సంఘటనలూ ఉన్నాయి.

కాని వారిద్దరి మధ్య నిశ్శబ్ద యుద్ధం ఇంత ఎక్కువ కాలం ఎప్పుడూ జరగలేదు.

రెండు దేశాల మధ్యగాని, ఇద్దరు మనుషుల మధ్య గాని, భార్యాభర్తల మధ్యగాని యుద్ధాలు ఊరికే జరగవు.

వాటి వెనకాల బలమైన కారణాలుంటాయి.

❀❀❀

బ్యాంక్‌లో క్లర్కుగా పని చేస్తున్న శంకరానికి, గవర్నమెంటు ఆఫీసులో స్టెనోగా పనిచేస్తున్న గౌరీదేవికి పాతికేళ్ళ క్రితం పెద్దల అనుమతితో పెళ్ళయింది. వాళ్ళది అన్యోన్య దాంపత్యమని చుట్టాలు, స్నేహితులు పొగుడుతారు.

దాంపత్యం సుఖమయం చేసుకోడంలోగాని, దుఃఖభాజనం చేసుకోవడంలోగాని భార్యాభర్తల ఇద్దరి బాధ్యతా ఉంటుందని వాళ్ళిద్దరూ నమ్ముతారు. అందుకనే తమ దాంపత్యాన్ని ఎక్కువ సుఖమయం చేసుకోడానికే ఇద్దరూ ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు.

ఒకరి మాటకు ఒకరు విలువ ఇచ్చుకుంటూ, ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకుంటూ పాతికేళ్ళుగా ఆనందంగా బతుకుతున్నారు.

పెళ్ళయిన కొద్ది సంవత్సరాలకే శంకరం బ్యాంక్‌లో ఆఫీసరు అయ్యాడు. గౌరీదేవి తర్వాత సెక్షనాఫీసరు అయింది.

పెళ్ళయిన సంవత్సరానికి ఓ అబ్బాయి, ఇంకో సంవత్సరంన్నర తర్వాత ఓ అమ్మాయి పుట్టారు.

పిల్లలిద్దర్నీ జాగ్రత్తగా పెంచి పెద్ద చేశారు.

## అసలు సిసలు హీరోయిన్ రేఖ

*వేసవిలో సినిమా యాక్టర్లూ, హీరోయిన్లూ, విదేశాలను వేసవి విడుదులుగా ఎంచుకుని, ఓ రెండు నెలలు అక్కడ చల్లగా గడిపి రావడం మామూలే. కానీ దీనికి విరుద్ధంగా ఎండాకాలం రెండు నెలలూ హైదరాబాద్, చెన్నైలలో గడిపింది రేఖ! 'సమ్మర్ హాలిడేస్' అని అనుకుంటే మాత్రం కచ్చితంగా పొరపడినట్టే! ఈమధ్య విడుదలైన సూర్యవంశంలో నటించిన సౌందర్యకి డబ్బింగ్ చెప్పింది రేఖ! ఆ విషయంగానే సౌత్‌లో గడిపింది. అదంతా పక్కన పెడితే, అమితాబ్ రియల్ హీరోయిన్ 'రేఖ' అని ఈ దెబ్బతోమళ్లీ తేలిపోయిది.*



విద్యాబుద్ధులు చెప్పించారు. వాళ్ళ అబ్బాయి ఆనంద్ ఎం.టెక్ పాసై ఢిల్లీలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు.

వాళ్ళ అమ్మాయి శిరీష ఎం.ఎస్సీ పాసైంది. ఆ పిల్ల ఉద్యోగంలో చేరదామని అనుకుంటుండగానే కావాల్సిన సంబంధం రావడం, ఆ అమ్మాయి పెళ్ళికి ఒప్పుకోవడం, తొందరగా బాధ్యత తీరుతుందని శంకరం దంపతులు అనుకోవడం - పెళ్ళి చేసెయ్యడం జరిగిపోయింది. ఆ పిల్ల బొంబాయి భర్త దగ్గరకి కాపురానికి వెళ్ళింది.

కాపురానికి వెళ్ళి సంవత్సరం తిరిగేసరికి గర్భిణీగా తిరిగి వచ్చింది.

కూతురు గర్భిణీ అయినందుకు శంకరం దంపతులు చాలా సంతోషపడ్డారు. ఆమెకి సులువుగా పురుడు వచ్చి మగపిల్లాడు కలిగితే ఇంకా సంతోషించారు.

అసలు కన్నా వడ్డీ ముద్దు!

ఆమెకి పురుడుపోసి అత్త వారింటికి పంపారు. ఒక్కసారిగా ఇల్లంతా బోసిపోయినట్టుగా అయింది.

❀❀❀

పురుడు పోసుకున్న కూతురు అత్తవారింటికి వెళ్ళిన వారం రోజులకి శంకరం భార్యతో ''నేను బ్యాంక్ పని మీద నాలుగు రోజులు క్యాంపుకి వెడుతున్నాను'' అన్నాడు.

ఆమె అసంతృప్తిగా మొహంపెట్టింది.

''మొన్ననే పిల్ల వెళ్ళిపోయింది. అసలే ఇల్లంతా బోసి పోయినట్టు ఉంది. మీరు కూడా క్యాంపుకెళ్ళిపోతే నాకేం తోస్తుంది'' అంది గౌరీదేవి.

''నిజమే - కాని తప్పదు. హెడ్డాఫీసు వాళ్ళు ఆర్డర్ వేశారు. వెళ్ళాల్సిందే'' అన్నాడు శంకరం.

''ఏదో వంకపెట్టి మానెయ్యండి'' బతిమాలింది గౌరీదేవి.

''తప్పదు గౌరీ - పోనీ ఓ పని చెయ్యి. ఈ నాల్గు రోజులు వైజాగ్‌లో మీ అన్నయ్య గారింటికి వెళ్ళిరా''. అన్నాడు.

''వైజాగ్‌లో మా వదిన లేదు. వాళ్ళమ్మ గారికి ఏదో ఆపరేషనుందని గుంటూరు వెళ్ళిందట. నిన్ననే అన్నయ్య ఫోన్ చేశాడు'' అంది.

''ఎంత నాల్గు రోజులేగా - కొంచెం ఓపికపట్టు'' అన్నాడు.

ఆమెకి భర్త సంగతి తెలుసు. ఎంతో అవసరం పడితేగాని, పొరుగూర్లకి వెళ్ళడానికి ఇష్టపడడు.

శంకరం క్యాంపుకి వెళ్ళిపోయాడు. గౌరీదేవి ఒంటరితనంతో బాధపడుతోంది.

రెండో రోజు వచ్చిన ఫోన్‌కాల్‌తో ఆమె ఆశ్చర్యంలో మునిగిపోయింది.

ఆ ఫోన్ కాల్ అతని ముఖ్య స్నేహితుడు ప్రసాదరావు నుంచి వచ్చింది. భర్త క్యాంపుకి వెళ్ళాడని చెప్తే ''అదేవిటి - నాకు చెప్పలేదు. ఏ ఊరెళ్ళాడు? ఎప్పుడొస్తాడు?'' అనడిగాడు ప్రసాదరావు.

ప్రసాదరావు శంకరానికి అతి ముఖ్యమైన స్నేహితుడు, సన్నిహితుడు. చిన్న చిన్న విషయాలు కూడా అతనితో చర్చిస్తాడు. అలాంటిది అతనికి చెప్పకపోవడమేమిటి? అనుకుంది గౌరీదేవి.

బహుశా హడావుడిలో చెప్పలేదేమోనని సరిపెట్టుకుంది.

ఆ మర్నాడు జరిగిన సంఘటన గౌరీదేవికి ఆశ్చర్యాన్నే కాదు. భయాన్ని కూడా కలిగించింది.

శంకరం పనిచేస్తున్న బ్యాంకు మేనేజర్ గౌరీదేవికి ఫోన్ చేసి ''ఏమ్మా శంకరం గారు ఎక్కడున్నారు? అనడిగాడు.

''బ్యాంక్ పనిమీదే క్యాంపు కెడుతున్నానని చెప్పారు'' అంది.

''బ్యాంక్ పనిమీదా? లేదే? తనకేవో స్వంత పనులున్నాయని నాలుగు రోజులు శెలవు కావాలని చెప్పారు. ఊళ్ళో ఉంటారా అనడిగితే ఉంటానని చెప్పారు - బ్యాంక్‌లో ఆయనతో పనిబడి ప్యూన్‌ని మీ ఇంటికి పంపించాను. తాళం వేసుందని చెప్తే మీకు ఫోన్ చేశాను. అయాం సారీ - ఏమీ అనుకోకండి.

శంకరం గారు వస్తే మాత్రం వెంటనే నాకు ఫోన్ చెయ్యమనండి'' అని మేనేజర్ ఫోన్ పెట్టేశాడు.

గౌరీదేవికి భయం, ఆందోళన మొదలయ్యాయి.

భర్త మా బ్యాంక్ పనిమీద క్యాంపుకి వెడుతున్నానని బట్టలు సర్దుకుని వెళ్ళాడు. వాయిదా వేసుకోమని తాను ఎంతలా అడిగినా కుదరదు గాక కుదరదు - అన్నాడు.

బ్యాంక్ మేనేజరేమో అతను బ్యాంక్ పని మీద వెళ్ళ లేదంటున్నాడు. అతని స్నేహితుడు ప్రసాదరావేమో శంకరం ఊరెడుతున్నట్టు తనకి చెప్పలేదంటున్నాడు.

ఎక్కడుంది తిరకాసు?

భర్త అంతకు ముందెప్పుడూ అలా అబద్ధాలు చెప్పలేదు. ఎప్పుడైనా స్నేహితులతో పార్టీలకి వెళ్ళినా, తనకిష్టం లేదని తెలిసినా - అబద్ధమాడకుండా నిజం చెప్తాడు.

మరెందుకిలా చేశాడు?

ఎంత ఆలోచించినా గౌరీదేవికి అర్థం కాలేదు. ఆమెకి ఆందోళన పట్టుకుంది.

ఒక వేళ భర్త ఎందులోనన్నా ఇరుక్కున్నాడా? దానివల్ల తనకి అబద్ధం చెప్పి అలా వెళ్ళిపోయాడా? నిజంగా ఏ గొడవలోనన్నా ఇరుక్కుంటే అతని ప్రాణానికేం భయంలేదు కదా? బ్యాంక్‌లో జరిగేవి, స్నేహితులతో జరిగే ఆర్థిక లావాదేవీలు అన్నీ ఎప్పటికప్పుడు తనకి చెప్తాడు - ఏదైనా గొడవలో ఇరుక్కుంటే తనికి చెప్పేవాడు కదా? మరెందుకు చెప్పలేదు?

ఎంత ఆలోచించినా గౌరీదేవికి సమాధానం దొరకలేదు. ఆమెకి భయం పట్టుకుంది.

ఆ రాత్రంతా ఆమెకి నిద్రపట్టలేదు. భయంతో, ఆందోళనతో, రకరాల ఆలోచనలతో ఆ రాత్రంతా గడిపింది.

మర్నాడు పొద్దున్నే వైజాగ్ ఫోన్ చేసి అన్నగార్ని రమ్మని పిలుద్దామనుకుంది. ఎప్పుడు తెలవారుతుందా అని ఎదురుచూస్తూ బిక్కుబిక్కుమంటూ రాత్రంతా గడిపింది.

తెల్లవారింది.

ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడైతే పరుగు పరుగున వెళ్ళి తలుపులు తీసి చూసింది.

భర్త ఆటో దిగుతున్నాడు.


ఒక్క ఉదుటున ఆటో దగ్గరకెళ్ళింది.

చేతిలో బేగ్ అందుకుని ''ఎక్కడికెళ్ళారు?'' అనడిగింది. ఆ ప్రశ్న విని అతను ఆశ్చర్యపోయాడు.

''లోపలికెళ్ళి మాట్లాడుకుందాం'' అన్నాడు కొంచెం విసుగ్గా. ముందామె బేగ్ పట్టుకుని, వెనకాల అతను పెట్టె పట్టుకుని ఇంట్లోకి నడిచారు.

''ఎక్కడికెళ్ళారు?'' ఆమె మళ్ళీ అడిగింది.

''బ్యాంక్ పనిమీద క్యాంప్‌కి వెడుతున్నానని చెప్పాగా. నాలుగు రోజులు పని ఉంటుందనుకున్నాను. ఒక రోజు ముందుగ్గానే అయిపోయింది.''




''నిజంగా మీరు బ్యాంక్ పనిమీదే వెళ్ళారా?''

''అదేమిటోయ్. అంత ఆశ్చర్యంగా అడుగుతున్నావ్ - నీతో అబద్ధం చెప్పాల్సిన పనేముంది?'' అన్నాడు.

''నిన్న మీ బ్యాంక్ మేనేజర్ ఫోన్ చేశాడు. మీరు స్వంత పనిమీద నాలుగు రోజులు శెలవు పెట్టారని చెప్పాడు. మీరు నాతోటి బ్యాంక్ పని మీద క్యాంప్‌కి వెడుతున్నాని చెప్పారు... నేనెంత హడలిపోయానో తెలుసా - నిన్న రాత్రంతా నిద్రపోతే ఒట్టు'' అంది.

''ఓసి వెర్రిపిల్లా - మా హెడాఫీస్ వాళ్ళు నన్ను బెంగుళూరులో ఓ కంపెనీ గురించి రహస్యంగా విచారణ జరపమని నియమించారు. ఈ విషయం మా మేనేజర్‌కి కూడా చెప్పొద్దన్నారు. స్వంత లీవు పెట్టుకోమని చెప్పారు.

అందుకే ఆయనకి నా క్యాంప్ విషయం తెలియదు'' అని చెప్పాడు శంకరం.

సమయానికి కథ బాగా అల్లానని అతను ఆనందపడ్డాడు. కాని అతని మొహంలో ఎంత దాచుకున్నా దాగని అబద్ధపు క్రీనీడ కదిలింది. ఆ క్రీనీడని గౌరీదేవి స్పష్టంగా కనిపెట్టింది.

భర్త ఎందుకంత దారుణంగా అబద్ధమాడుతున్నాడో ఆమెకి అర్థంకాలేదు. మళ్ళీ మళ్ళీ అదే విషయం అడిగి అతన్ని బాధపెట్టడం, అతని అహంకారాన్ని దెబ్బ తియ్యడం ఆమెకి ఇష్టం లేదు. ఎప్పటికైనా అసలు విషయం అతనే చెప్తాడని ఆమె ఊరుకుంది.

శంకరం కాఫీతాగి పేపరు చదివి, స్నానం ముగించి భోజనం చేసి బ్యాంక్‌కి వెళ్ళాడు. అంతసేపూ అతను ఎక్కువ మాట్లాడలేదు, అన్యమనస్కంగా ఉన్నాడు.

సాధారణంగా అతనెప్పుడూ హుషారుగా ఉంటాడు. ముఖ్యంగా ఇంట్లో తను, భార్య మాత్రం ఉన్నప్పుడు మరింత హుషారెక్కిపోతాడు.

శృంగార సంభాషణ జరుపుతూ, శృంగార చేష్టలు చేస్తూ హడావుడి చేస్తాడు. భార్యను వంటింట్లో పని చేసుకోనివ్వడు. వెనకాల్నుంచి ఆమెను చేతులతో చుట్టి, ముద్దుపెట్టుకుని, బుగ్గకొరికి ఊపిరి సలపకుండా చేస్తాడు.

అలాంటిది ఆ రోజు చాలా మౌనంగా, ఏదో పోగొట్టుకున్న వాడిలా ప్రవర్తించాడు.

సాయంత్రం బ్యాంక్ నుంచి తిరిగి వచ్చాక కూడా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. నిశ్శబ్దంగా తన పనులు తాను చేసుకుంటూ గడిపాడు. భోజనం అయ్యాక టి.వి దగ్గర కూర్చున్నాడు.

భర్త తన నుంచి ఏదో భయంకరమైన విషయం దాస్తున్నాడని గౌరీదేవికి అర్థం అయిపోయింది.

మంచుగడ్డలా ఉన్న అతని మౌనాన్ని కరిగించాలి - అనుకుంది. అతను కూర్చున్న సోఫాకి ఎదురుగా నేలమీద కూర్చుని అతని మోకాళ్ళ మీద చేతులు వేసి ''ఎందుకిలా ఉన్నారు? ఏం జరిగింది? ఏదైనా సమస్యుంటే నాకు చెప్పండి ఇద్దరం కలిసి పరిష్కరించుకుందాం. అలా మీలో మీరే కుమిలిపోతే ఎలా?'' అనడిగింది.

అతను ఏం మాట్లాడలేదు.

''అయితే మీకు - నాకు చెప్పకూడని రహస్యాలు కూడా ఉన్నాయా?'' అని ఆమె కళ్ళనీళ్ళెట్టుకుంది.

ఆమె కళ్ళలో నీళ్ళు చూసేసరికి అతని మనసు కరిగిపోయింది.

అతని కళ్ళలోనూ నీళ్ళుతిరిగాయి.

''నీ దగ్గర నాకేం రహస్యాలుంటాయి? జరిగినదంతా చెప్తాను. విని తట్టుకోగల శక్తి కూడగట్టుకో'' అన్నాడు.

లేచి వెళ్ళి టి.వి ఆఫ్ చేసి, ట్యూబ్‌లైటు ఆర్పేసి, డిమ్ లైటువేసి వచ్చాడు. అతను తన మొహంలోకి చూడ్డానికి భయపడుతున్నాడని ఆమె గ్రహించింది. అతను గోడకేసి చూస్తూ చెప్పడం మొదలెట్టాడు.

''మనకి పెళ్ళయి పాతిక సంవత్సరాలైంది. అప్పటికి నాకు ఇరవై నాలుగో ఏడు. నీకు ఇరవై ఒకటి. కొన్నాళ్ళపాటు బిడియపడ్డా, తర్వాతర్వాత శృంగారంలో నాకు పూర్తిగా సహకరించడం మొదలెట్టావు.

నీకు తెలుసు. నాకు శృంగార కోరికలు ఎక్కువ. జీవితంలో నాకు లైంగిక కార్యక్రమం వల్ల కలిగే ఆనందం ఇంకదేనివల్ల కలగదు.

నేను పార్టీలకెడితే నీకావాసన పడదు కాబట్టి

నువ్వు నా దగ్గరికి రావని చాలాసార్లు పార్టీలకెళ్ళడం మానుకున్నాను. పార్టీలవల్ల నాకు కలిగే కిక్కన్నా నిన్ను పెనవేసుకుంటే కలిగే కిక్ ఎంతో గొప్పది.

నా శృంగార జీవితం రసమయం కావడానికి నువ్వెంతో సహకరించావు - కృతజ్ఞుణ్ని.

రెండు మూడేళ్ళుగా నీలోను, నాలోను విపరీతమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా మనమ్మాయి పెళ్ళయినప్పట్నుంచీ నేను పెద్ద వాడినై పోయానన్న భావం, శృంగారానికి పూర్వంలా పనికి రానేమోనన్న భావన నన్ను విపరీతంగా కృంగదియ్యడం మొదలెట్టాయి.

మనమ్మాయికి పిల్లాడు పుట్టి నేను తాతనయ్యేసరికి ఆ భావాలు మరింత ఎక్కువయ్యాయి.

దానికి తగ్గట్టే నువ్వు కూడా శృంగార జీవితం పట్ల ఆసక్తి చూపించడం తగ్గించావు.

నీ దగ్గరికి చేరితే ''మీకు ఈ వయసులో ఆ పిచ్చేమిటి'' అనో, ''తాతయ్య అయ్యారు గుర్తుంచుకోండి'' అనో, ఇంకా ''కృష్ణారామా అనుకోవాలి'' అనో అనడం మొదలెట్టావ్.

దాంతో మానసికంగా నేను మరింత కృంగిపోయాను.

నీకు నిజంగా లైంగిక కోరికల మీద ఆసక్తి తగ్గిందా? లేక నేను నిన్ను సరిగా తృప్తిపరచలేకపోవడం వల్ల తగ్గిందా? - అన్న ప్రశ్నలు నా ఎదురుగా నిలబడి సమాధానం కోరడం మొదలెట్టాయి.

పురుషుడిగా నా పరిస్థితి ఏమిటి? నా పుంసత్వం తగ్గిపోయిందా - పూర్వంలా ఉందా అని పరీక్షించుకోవాలనే కోరిక కలిగింది.

మనసు వద్దంటున్నా దాన్ని అణచిపెట్టి పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నాను.

నాకు తెలిసున్న ఒకావిడ ఉంది. ఆవిడ పేరు శకుంతల - విధవరాలు. డబ్బుకోసం అప్పుడప్పుడు మగాళ్ళతో వెడుతుంది.

ఆవిణ్ని తీసుకుని బెంగుళూరు వెళ్ళాను. హోటల్లో రూం తీసుకున్నాను. మనసుని ఎంత నొక్కిపెట్టి నన్ను నేను పరీక్షించుకోవాలని ప్రయత్నించినా అంతరాత్మ అడ్డు తగిలింది.

నీకు నిజం చెప్తున్నాను. తప్పు చేస్తున్నానన్న భావం నన్ను చుట్టుముట్టింది. ఎంత ప్రయత్నించినా ఆమె దగ్గర నేను పురుషుణ్ణి కాలేకపోయాను. ఆమెను కలవలేకపోయాను. మర్నాడే ఆమెకివ్వాల్సిన డబ్బు ఇచ్చేసి పంపించేశాను. వెంటనే బైల్దేరి రావడానికి మనసు ఒప్పుకోలేదు. దక్షిణాదిన ఉన్న గుళ్ళు, గోపురాలు చూసి ఈ రోజు పొద్దుటికి తిరిగి వచ్చాను.

గౌరీ! నేను చేసింది తప్పే - ఒప్పుకుంటాను. చేసిన పనికి అపరాధ భావంతో కుమిలిపోతున్నాను. ఇది నిజం.

జరిగినదంతా విన్నావుగా - నన్ను క్షమించమని అడగను. నా మీద నీకున్న నమ్మకాన్ని వమ్ము చెయ్యడానికి ప్రయత్నించడం కన్నా వేరే ద్రోహం లేదు.

నువ్వు ఏ శిక్ష విధించినా భరించడానికి సిద్ధంగా ఉన్నాను. ఇహ నీ ఇష్టం.

అతను చెప్పడం పూర్తిచేసి లేచి గోడకేసి తిరిగి నుంచున్నాడు. అతని కళ్ళ నుంచి నీళ్ళు కారుతున్నాయి.

గౌరీదేవికి తల తిరుగుతున్నట్టనిపించింది. భర్త ఇలా ప్రవర్తిస్తాడని ఆమె ఊహించలేదు.

భర్త అనుచిత ప్రవర్తనకి శిక్షించాలా? చేసిన తప్పు ఒప్పుకున్నందుకు శిక్షించాలా? ఆమెకేమీ అర్థం కాలేదు. ఆమెకి మనసంతా గజిబిజిగా ఉంది.

వెంటనే లేచి గదిలోకి వెళ్ళిపోయి తలుపేసేసుకుంది. అతను నిర్జీవంగా సోఫాలో కూర్చుండిపోయాడు.

ఆ క్షణం నుంచి వాళ్ళిద్దరి మధ్య మాటల్లేవు. ఎదురు బడటాలు లేవు. ముద్దుముచ్చట్లు లేవు. ఇద్దరు అపరచిత వ్యక్తుల్లా ప్రవర్తిస్తున్నారు.

ఆ నాటి నుంచి శంకరం పడక గదిలో ఆమె పక్కన పడుకోవడం లేదు. వేరే గదిలో పడుకుంటున్నాడు.

నిశ్శబ్ద యుద్ధం ఓ వారం జరిగింది.

ఓ రోజు రాత్రి...

శంకరం వేరే గదిలో పడుకుని నిద్రపోతున్నాడు. ఎవరో తన మీద చెయ్యి వేసినట్టనిపిస్తే అతనికి మెలకువ వచ్చింది.

''గౌరీ...'' అతని పిలుపు ఎంతో మార్దవంగా ఉంది.

''శంకూ'' ఆమె శృంగార సమయంలో అతన్నలా పిలుస్తుంది. ఆమె అతని మీద చెయ్యివేసి దగ్గ




రికి లాక్కుంది.

అతనామెను గట్టిగా హత్తుకున్నాడు.

ఆమె సన్నగా ఏడవడం మొదలెట్టింది. అతనామె ఏడుపును భరించలేడు.

''వద్దు - నువ్వు ఏడవొద్దు. నేనింక ఎప్పుడూ ఇలా ప్రవర్తించను. నీ మీద ఒట్టు. ప్లీజ్ - ఏడవకు'' అతను చలించిపోయి వణుకుతున్న మాటలతో అన్నాడు.

ఆమెకి మనసు కుదుటపడింది.

ఆర్తిగా, ఆశగా అతన్ని అల్లుకుపోయింది. మొహమంతా ముద్దులతో నింపింది. అతనూ అలాగే ప్రతిస్పందించాడు.

ఆమె అతన్ని పూర్తిగా వివస్త్రుణ్ణి చేసింది. అతనూ అలాగే ప్రతిస్పందించాడు.

వారిద్దరి మధ్యా ప్రాకృతమైన కోరిక బుసలు కొట్టింది. ఒకే ఒక లక్ష్యం సాధించడానికి ఇద్దరూ తమ తమ మార్గాల్లో శోధిస్తున్నారు.

ఒకే ప్రస్థానం చేరుకోడానికి ఇద్దరూ సాధన చేస్తున్నారు. ఎవరికి వారే ఆ సంగ్రామంలో గెలవాలని, అవతలి వారిని గెలిపించాలని తాపత్రయపడు తున్నారు.

'శంకూ - జరిగిన విషయం మర్చిపోదాం. కాని ఒక్క మాట చెప్తాను - విను. మానవ నాగరికతా క్రమంలో అభివృద్ధి చెందిన ఒకే ఒక గొప్ప వ్యవస్థ - పెళ్ళి. అన్ని కాలాల్లో అన్ని పరీక్షలకి నిలబడిన గొప్ప వ్యవస్థ దాంపత్యం.

ఒక మగాడు- ఒక ఆడది కలిసి బతకడం- అదే నమ్మకంగా బతకడం - సృష్టికే కొత్త అందాన్ని సంతరించింది.

నీకు కలిగిన భావనలే నాకూ కలిగితే?

ఒక్కసారి ఆలోచించు.

దాంపత్యాన్ని నాశనం చేసుకోడానికి ఒక్క నిముషం పట్టదు. నిలబెట్టుకోడానికి ఒక జీవితకాలం పడుతుంది.

వయసు పెరిగే కొద్దీ శృంగార భావనలు తగ్గుతాయి. శరీరం కూడా పూర్వంలా సహకరించదు. ఇది సహజం. ఇంకెప్పుడూ అలాంటి భావనలు మనసులోకి రానివ్వకు.

''నాకు నువ్వే దిక్కు! ఆ విషయం గుర్తు పెట్టుకో'' అంది.

''సారీ గౌరీ!'' అతను ఇంకేమీ మాట్లాడలేక పోయాడు.

ఆమె మళ్ళీ విజృంభించింది.

అతన్ని కోరికల మహా సముద్రంలోకి లాక్కుంది. వాళ్ళిద్దర్కీ పాతికేళ్ళ క్రితపు రోజులు గుర్తుకొచ్చాయి. విశ్వరహస్యాన్ని ఛేదించడానికి ఇద్దరూ పోటాపోటీగా ఉద్యుక్తులయ్యారు.